



# పల్లెలకు కొత్త వెలుగు- సంక్రాంతి



హరిలొరంగ హరి అంటూ చిడతలు వాయించుకుంటూ... చేతిలో తంబూరాతో ప్రత్యేకమైన ఆహార్యంతో డిసెంబర్ నెలలో పల్లెలు, పట్టణాలకు ఉదయపు వేళ ఒక కొత్త శోభ తీసుకువచ్చే హరిదాసులను చూడగానే అర్థమైపోతుంది మనకు సంకాంత్రి పండుగ ఇక ఎంతో దూరంలో లేదని, సంక్రాంతి పండుగ అంటే తెలుగువారికి మిగిలిన పండుగల కంటే ప్రత్యేకమైనది. నిండిన గాదెలతోధాన్యం చేతికి అంది రైతన్నలు 'పురి'విప్పిన ఆనందంతో, ఉత్సాహంతో చేసుకునే ఈ పండుగ భారతదేశానికంతటికీ ఉత్సాహాన్ని పంచే పండుగ. ఈ పండుగ గురించి ఈ ప్రత్యేక వ్యాసం

తెలుగు వారికే కాదు, భారతీయులందరికీ సంక్రాంతి అంటే పె... ద్ద... పండుగే మరి, దసరా మినహా మరే ఇతర పండుగకీ ఈ పండుగకు వచ్చినంత శోభ రాదు. ఇప్పుడిప్పుడు కొద్దిగా కళ తగ్గుతున్నా, నేటికీ మన పల్లెప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకునే పండుగ ఇదే. శరన్నవరాత్రులు పేరుతో తొమ్మిది రోజుల పాటు దసరా ఉత్సవాలు సాగితే, ధనుర్మాసమనే పేరుతో సంక్రాంతి పండుగకు నెలరోజుల ముందు నుంచే పండుగ కళ వచ్చేస్తుంది.



హరిలో రంగ హరి అంటూ హరిదాసులు వారికే ప్రత్యేకమైన వేషధారణాతో చలి పరదాల మేలి ముసుగు తెర తీసుకుంటూ హరినామ స్మరణాతో ప్రత్యక్ష మైపోతారు. ప్రతి ఇంటి ముందు అందమైన రంగవల్లులు తీర్చి దిద్ది సొగసు దిద్దుకుని ఉంటాయి. దాదాపు అదే సమయంలో ఇంటికి చేరిన ధాన్యరాశితో ప్రతిఇల్లూ కళకళలాడుతూ ఉండే ఈ పండుగ శోభ మరే పండుగకు వస్తుంది? ఒక్క హరిదాసులే కాదు.. గంగిరెద్లవారు, జంగమ దేవరలు మనముందుకొచ్చేది ఈ మాసంలోనే.

మనందరికీ ఆ ఎడ్లపందేలు, కోడిపమ్దేలు పేరుతో ఆనందోత్సహాలను తెచ్చిపెట్టే ఈ ధనుర్మాసం, సంక్రాంతి విశిష్టతను తెలుసుకుందామా?

సంక్రాంతి అనేది సూర్యగమనంతో ఆధారపడిన పండుగ. మిగిలిన పండుగలకు చాంద్రమానాన్ని అనుసరించేమనం, ఈ పండుగకు మాత్రం సౌరమానాన్ని అనుసరిస్తాం. సూర్యుడు ఒకరాశి నుండి మరో రాశిలోకి ప్రవేశించడమనే సంక్రమణమంటే, ఈ సంక్రమణాన్ని సంక్రాంతి అని సంక్షిప్తంగా పిలుచుకుంటాం. మేషరాశి మొదలు మీనరాశి వరకు గల పన్నెండు రాశులలోని ఒక్కో నెలలోనూ ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు సూర్యుడు. మరి ఆ సంక్రమణాలకు లేని ప్రత్యేకత దీనికి మాత్రమేమిటంటే... ఉంది..ఈ ధనుర్మాసంలోనే స్వర్గద్వారాలు తెరుచుకుంటాయట. ఎంతో పవిత్రమైన ముక్కొటి ఏకాదశిని ఈ సత్యానికి నిదర్శనంగా మనం జరుపుకుంటుంటాం.



ఆంగ్ల క్యాలెండర్‌ను అనుసరించి జనవరి 14న తేదీన సూర్యుడు ధనస్సు రాశిలోన ప్రవేశిస్తాడు. ఈరోజునే సంక్రాంతి పండుగగా జరుపుకుంటుంతాం. ఈ సంక్రాంతి ముందు నెలరోజులూ ధనుర్మాసమని పిలుస్తారు. ఇక ఈ సంక్రాంతి పండుగప్పుడే మన ముందు నల్లని వస్త్రాలు ధరించిన దైబ భక్తులు ప్రత్యక్షమవుతారు. వీరు అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులు.

మండలం పాటు కఠోర దీక్షను ఆచరించిన ఈ భక్తులు జనవరి 14న కనిపించే జ్యోతిని తిలకించడానికి, ఆ నెలలోనే తెరిచి ఉండే ఆలయంలో కొలువై ఉన్న అయ్యప్పను దర్శించుకోవడానికి కేరళలో ఉన్న శబరిమలకు వెళ్ళి, ఎన్నో కషనష్టాలకు ఓర్చి అయ్యప్పను దర్శించుకుని సాంత్వన పొందుతారు.మన పల్లె పట్టులు పచ్చగా కళకళలాడుతున్నప్పుడే మనకీ సంక్రాంతి శోభ ద్విగుణీకృత మవుతుంది. ప్రతి ఏడాది వలె ఈ ఏడాదీ వచ్చిన సంక్రాంతి మనందరికీ ధనధాన్యాలు, శాంతి సౌభాగ్యాలు ప్రసాదించాలని భగవంతున్ని వేడుకుందాం.